# డబుల్ ఫోర్ - డబుల్ ఫైవ్

ఖాదర్ భాషా మనసు మనసులో లేదు. అతని చేతుల్లోని స్టీరింగు వీలు. తల్లి చేతుల్లోని పసిబిడ్డలా అటూ ఇటూ సున్నితంగా కదులుతోంది. నిండుకుండలా పాసెంజర్లతో నిండిఉన్న బస్సు నాయుడుపేట వదలి రోడ్డుమీద పరుగిడుతోంది.

ఈ రోజే ఖాదర్ భాషా డ్యూటీ ఎక్కాడు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన అతనికి పదే పదే గుర్తుకు రాసాగింది....

ఆ రోజు ఖాదర్ భాషా అఫ్‌లో ఉన్నాడు. డ్యూటీలో ఇంకో డ్రైవరు పోతున్నాడు. ఇంటి దగ్గరున్న ఖాదర్ భాషాకు తను నడిపే ఎ. పి. యస్ డబుల్ ఫోర్ డబుల్ ఫైవ్ బస్సును అమ్ముతున్నట్లు వార్త అందింది. దాంతో అఘమేఘాల మీద పరుగెత్తాడు కంపెనీ ఆఫీసుకు.

ఆఫీసు రూములో మేనేజరు, బస్సు ఓనరు. ఇంకో ఇద్దరు కొత్త వ్యక్తులు కూర్చొని ఉన్నారు. బస్సు అమ్మకానికి సంబంధించిన లావాదేవీలు మాట్లాడుకొంటున్నారు. ఖాదర్ భాషా గదికి ఎదురుగా నిలబడి ఎగకట్టి ఉన్న గళ్ళ లుంగిని క్రిందికి వదలి ఓనరువైపు చూస్తూ రెండు చేతులెత్తి నమస్కారం పెట్టాడు. ఓనరు ఏమిటన్నట్లు సైగ చేశాడు. బయటకు రండి సార్. మీతో కొద్దిగా మాట్లాడాలి అన్నట్లు సంజ్ఞచేసి పిలిచాడు ఖాదర్ భాషా.

యాభై ఏళ్ళ ఖాదర్ భాషా అంటే ఆ మోటారు కంపెనీలో అందరికి అంత అభిమానం. శ్రమ దాచుకోకుండా కష్టపడి పని చేస్తాడని ఓనరుకు ఇంకా అభిమానం.

"ఏం భాషా ఇట్లా వచ్చావ్" ఆప్యాయంగా అడిగాడు ఖాదర్ భాషా. ఏం మాట్లాడలేదు.

"డబ్బేమైనా అవసరమా" ఆదరంగా అడిగాడు. కాదు అన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

"మరి"

"తమరు బస్సును అమ్ముతారని విన్నాను" అసలు విషయం బయటపెట్టాడు.

"ఓస్, అదా నీ భయం. బస్సు అమ్మితే మాత్రం నిన్ను వదులు కొంటామా. కొత్త బస్సుకు డ్రైవరువు నువ్వేగా" నవ్వుతూ అన్నాడు.

"అది కాదు సార్. ఇప్పుడు ఈ బస్సును అమ్మాల్సినంత అవసరం ఎందుకు ఏర్పడిందని" ధైర్యం తెచ్చుకొని అడిగాడు.

"అమ్మక ఆ డొక్కు బస్సు దేనికి భాషా. కొత్త లైలాండు బస్సు కొంటున్నాంగా."

'డొక్కు బస్సు' అనేటప్పటికి భాషా గుండె బాధగా కొట్టుకొంది. ఈ డొక్కు బస్సే తనని నలభై ఏళ్లుగా పోషిస్తూ స్నేహితుడిలా వెన్నంటి ఉంది.

"సార్. దీన్ని అమ్మక తప్పదా" తనకున్న చనువును పూర్తిగా వినియోగించుకొన్నాడు.

"అమ్మక ఏం చేద్దామంటావు. ఇంట్లో పెట్టుకొని పూజ చేయ మంటావా" నవ్వాడు ఓనరు.

"అదికాదు సార్. బండి పాతదయినా మంచి కండిషన్‌లో ఉంది. ఇంతకాలం మన దగ్గర పనిచేసింది.

"అయితే ధర యింకా పెంచమంటావా."

"ధర విషయం కాదు సార్. బస్సును అమ్మొద్దంటాను."

నువు చెప్పేది నాకేం అర్థం కావడంలేదు ఖాషా. బస్సు అమ్మొద్దంటే ఎలా. ప్రస్తుతం ఇదే రూటులో ఆర్. టి సి బస్సొకటి కొత్తగా తిరిగేది నీకు తెలుసుగదా. బస్సు నీట్‌గా అద్దంలా ఉంటే కదా పదిమంది ఎక్కేది."

"మన బస్సుకేం సార్."

"మళ్ళీ అదే మాట. నా బస్సు గురించి నేను చెప్పుకోవాల్నా. సీట్లు సరిగా ఉన్నాయా. టాపు అంతా పగిలి బస్తా లగేజి వేసినా భరిస్తదా. అడుగున చెక్కలన్నీ పగిలి ఉన్నాయి. ఇదంతా రిపేరు చేయించాలంటే యాభయివేలవుతుంది. అందుకే దీన్ని అమ్మేసి లక్ష యాభై వేలుపెట్టి కొత్తది కొంటున్నా."

"సార్ ! దీన్ని అమ్మడం నాకు యిష్టంలేదు" మనసులోని మాట సూటిగా చెప్పేసాడు.

"నీకు యిష్టం లేకపోతే ఎవడిక్కావాలోయ్ పుల్లాయ్" అన్నట్లు ఒక చూపు విసిరిన ఓనరు "ఖాషా! నీకు కావాలంటే చెప్పు బస్సును పదివేలకు తగ్గించి యిస్తా" అన్నాడు వ్యంగ్యంగా.

ఖాదర్‌ఖాషా గుండె ఒక్కసారిగా జల్లుమంది. బస్సును తనకిస్తాననేసరికి, కాని డబ్బు మాటేమిటి? అందుకే ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఓనరు కొన్ని నిముషాలు ఖాదర్‌ఖాషా ముఖంలో కదిలే రంగుల్ని గమనించి త్రాగుతున్న సిగరెట్ క్రిందపడేసి కాలితో నలిపి ఆఫీసు రూములోకి వెళ్ళిపోయాడు. నలిగిపోయి ఇసుకలో కలసి పొడిగా మిగిలిన సిగరెట్ పీకవంక దీనంగా చూసి తన మాటకున్న విలువకు, ఓనర్ల లాభాలకున్న విలువకు మధ్యగల దూరాన్ని ఊహించుకొని దుఃఖిస్తూ ఇంటముఖం పట్టాడు.

ఇంటికొచ్చి మంచంమీద పడుకొని పైకప్పువంక చూస్తూ ఆలోచించసాగాడు....

ఖాదర్ భాషా జీవితం చాల విచిత్రమైంది. ఒకరోజు సినిమా చూసి భార్యతో వస్తున్న మీరాసాయిబుకు కొంతమంది పిల్లలమధ్య ఏడుస్తూ నిలబడి ఉన్న పదేళ్ళ పిల్లవాడు కనిపించాడు. వాడి వొంటిమీద చొక్కా లేదు. చినిగిన నిక్కరు వేసుకొని ఉన్నాడు. వాడు ఉర్దూ మాట్లాడుతున్నాడు. చుట్టూ ఉన్న తెలుగు పిల్లలకు అది అర్థంగాక ఎగతాళి చేస్తున్నారు. మీరాసాయిబు వాణ్ని ఉర్దూలో నువ్వెవరవని అడిగాడు తను ఎవరూలేని అనాథనని తనకు కూడు గుడ్డ పెడితే ఏ పనయినా చేస్తానని చెప్పాడు.

పిల్లలులేని మీరా సాయిబు దంపతులు ఖాదర్ భాషాను తమతో తెచ్చుకొని పెంచసాగారు. ఓ ఆరు నెలలు గడిచేసరికి ఖాదర్ భాషా తెలుగు బాగా నేర్చుకొన్నాడు. బెరుకు తీరగానే తనకు ఏదయినా పని యిప్పిస్తే చేస్తానని చెప్పాడు. మీరాసాయిబు మంచిరోజు చూసి ఖాదర్ భాషాను ఓనరు రెడ్డి దగ్గరకు తీసుకువెళ్ళాడు.

"సాబ్ ! మా బంధువుల పిల్లోడు. షెడ్డులో పనికి పెట్టుకోండి" అన్నాడు మీరాసాయిబు.

"పిల్లవాడు హుషారుగా ఉన్నట్లున్నాడు. నా బావమరిది ఈ రోజే కొత్త బస్సును కొన్నాడు. అందులో పిడ్నక్లీనరుగా పెడదాం ఏమంటావ్" అన్నాడు.

"అంతా అల్లా దయ ఆపైన తమరి దయ" అన్నాడు ఆనందంగా.

"సరే మీరాసాయిబూ, బేస్తవారం మంచిరోజు. ఆ రోజు బస్సు రూటుమీద పెడతాం. ఈ లోపల నాల్రోజులు మన మల్లాం బస్సులో ఎల్లమను. ట్రెయినింగు అవుతాడు" హుందాగా నవ్వాడు ఓనరు. ఆయనకు నాలుగు బస్సులు, నాలుగు లారీలు ఉన్నాయి.

మీరాసాయిబు ఒకటికి పదిసార్లు క్రిందికివంగి నమస్కారాలు పెట్టి సెలవు తీసుకొన్నాడు. ఖాదర్ భాషాను తీసుకొని తృప్తిగా ఇంటికి వెళ్ళాడు.

అలా సదరు బేస్తవారం రోజు నాయుడుపేట వెంకటగిరి బస్సు ఉద్భవిస్తే అందులో క్లీనరుగా అదేరోజు ఖాదర్ భాషా వెలిసాడు.

అలా క్లీనర్‌గా ఆ బస్సులో జీవితాన్ని ప్రారంభించిన ఖాదర్ భాషా తన తెలివితేటలతో ఎంతో నేర్చుకొన్నాడు. అందరి మన్ననలు పొందాడు. తరువాత అదే బస్సులో కండెక్టరుగా ఉద్యోగం చేసాడు. అతనికి ఆ బస్సంటే ఎంతో ప్రేమ. ఎందుకంటే ఇద్దరూ ఒకేసారి పనిలో చేరారు. అది ఒంటరిది. తల్లి, దండ్రి లేని తనూ అంతే. దాన్ని ఒక్క రోజు చూడందే ఉండగలిగేవాడు కాదు. అందుకే డ్రైవింగు నేర్చుకొని ఆ బస్సుకే డ్రయివరయ్యాడు. అలా బస్సుతో తన అనుబంధాన్ని బలంగా పెంచుకొన్నాడు.

మీరాసాయిబు మేనకూరులో కాపురం ఉండేవాడు. మేనకూరు గ్రామం వెంకటగిరికి, నాయుడుపేటకు మధ్యఉండే పెద్ద గ్రామం. ఖాదర్ భాషా డ్యూటీలో ఉన్నప్పుడు బస్సును వదలి క్షణం గడిపేవాడు కాదు. బస్సే అతనికి సర్వస్వం. డ్యూటీ దిగిన రోజుల్లో మేనకూరులో బస్సు ఆగే సెంటర్‌వద్ద నున్న అరుగుమీద కూర్చొని ప్రతి ట్రిప్‌లోనూ దాన్ని తనివితీరా చూసుకొని ఆనందించేవాడు.

తరువాత ఖాదర్ భాషాకు పెళ్ళయ్యింది. కాలక్రమంలో అతన్ని తీసుకొచ్చి తమ దగ్గర పెట్టుకొన్న మీరాసాయిబు, ఆతని భార్యా పోయారు. ఆ బాధను కొంతకాలం దిగమింగుకొన్నాడు భాషా. తరువాత ఖాదర్ భాషాకు సంతానం కూడా లేకుండాపోయింది. అయినా అతను ఎక్కువ బాధపడలేదు. కాని ఈరోజు బస్సు అమ్ముతారంటేనే బాధగా ఉంది. అందులో తన తల్లిని, తండ్రిని, తోబుట్టువుల్ని, స్నేహితుల్ని ఆఖరుకు తనకులేని బిడ్డల్ని కూడా అందులోనే ఊహించుకొని జీవిస్తున్న ఖాదర్ భాషాకు ఈ సమస్య కొరకరానికొయ్య అయింది.

కథా నిలయం
1264
శ్రీకాకుళం

"మేనకూరు.... మేనకూరు...." క్లీనరు అరుపులకు ఈ లోకం లోకి వచ్చాడు అప్రయత్నంగానే బస్సుకు బ్రేకులు పడ్డాయి.

"అన్నం" అంటూ అతని భార్య కిటికీ దగ్గరకొచ్చి సిల్వరు కారియరు అందించింది. డోరు తెరచి ఎటోచూస్తూ దాన్ని సీటు ప్రక్కనే పెట్టుకొన్నాడు. భార్యను పలుకరించలేదు. డోరు వేసుకొన్నాడు. ఖాదర్ భాషా భార్య జమీలాకు అన్నీ తెలుసు. కాని ఏం చేయగలదు పాపం.

"టీ భాయ్" అంటూ టీ బంకు కుర్రాడు కిటికీపైకి ఎత్తి పట్టుకొన్నాడు గ్లాసును.

ఖాదర్ భాషా దాన్ని అందుకోలేదు. వ్రేళ్ళమీద నిలబడి ఉన్న టీ కుర్రాడు కాళ్ళు నొప్పిపుట్టేసరికి వెనక్కు తీసుకొని వెళ్ళిపోయాడు.

"రైట్" అన్నాడు కండెక్టరు. మళ్ళీ బస్సు బయలుదేరింది.

నలభై సంవత్సరాలుగా అలవాటైన దారి, అలవాటైన బస్సు. అలవాటైన చేతులు. కాళ్ళు. ఖాదర్ భాషా ఎంత పరధ్యానంగా ఉన్నా చేతులు చెయ్యాల్సిన పనులు చేతులు, కాళ్ళు చెయ్యాల్సిన పనులు కాళ్ళు అసంకల్పితంగా చేసుకుపోతున్నాయి. పాసెంజర్లకు ప్రయాణం సుఖంగా జరిగిపోతూ ఉంది.

ఆ రాత్రి నాయుడుపేటలో బస్సు నైటుహాల్టు రాత్రి పదిగంటలకు వచ్చింది. ఖాదర్ భాషా బస్సు దిగలేదు. భోజనం చేయలేదు. తన సీటు దగ్గరకు టీ తెప్పించుకొని త్రాగి స్టీరింగు పీలుమీద తలవాల్చి పడుకొన్నాడు. కండెక్టరు, క్లీనరు భోంచేయమని ఎంత బ్రతిమాలినా అతను అక్కడ్నుంచి కదల్లేదు. బస్సును అమ్మకుండా ఆపలేని అశక్తత, బస్సును కొనలేని ఆర్థిక పరిస్థితి. అది లేక తను ఎలా బ్రతకాలి అనే ఆవేదన అతన్ని క్రుంగదీస్తున్నాయి. ఆ రాత్రి అలాగే పడుకొని నిద్ర పోయాడు.

తెల్లవారింది. ఇక్కడనుంచి ఉదయం ట్రిప్పు వెంకటగిరి బయలు

దేరిన బస్సు అక్కడకు చేరేసరికి పదవుతుంది. అక్కడ ఓనరు చేతులు మారుతుంది బస్సు. ఇక ఆ రోజుకు బస్సు నడవదు. ఆరోజు మంచి రోజు గనుక పూజలు పునస్కారాలతో ఆ రోజంతా సరిపోతుంది.

వేకువనే లేచిన ఖాదర్‌భాషా దగ్గరలో ఉన్న సువర్ణముఖి నదికెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని స్నానంచేసి వచ్చాడు. తరువాత క్లీనరు ప్రక్కనున్న కొళాయి దగ్గరనుంచి బక్కెట్‌తో నీళ్ళు తెస్తుంటే బస్సంతా తనే స్వయంగా కడిగాడు. తరువాత అద్దాలు, లైట్లు, బొయినెట్, స్టీరింగు, బ్రేకులు శుభ్రంగా కడిగి తుడిచాడు.

తరువాత ఆరుమూరల మల్లెపూల దండతెచ్చి బస్సులోపల అద్దాల మీదుగా ఆ చివరనుంచి ఈ చివరవరకు వ్రేలాడదీసాడు. డ్రైవింగు సీటులో కూర్చొని ఎదురుగా ఒకే ఫ్రేములో బిగించి ఉన్న వెంకటేశ్వరస్వామి, అల్లా, ఏసుక్రీస్తు బొమ్మలకు కూడా మల్లెపూల మాల వ్రేలాడదీసాడు. తరువాత అయిదు సాంబ్రాణి కడ్డీలు వెలిగించి స్టీరింగు పీలుకు ఒకటి గ్రుచ్చి, దేవుడు బొమ్మలున్న ఫోటో ఫ్రేముకు అటు రెండు, ఇటు రెండు కడ్డీలు గుచ్చాడు.

తరువాత సీట్లో కూర్చొని రెండు చేతులెత్తి దేవుళ్ళకు నమస్కరిస్తూ 'బస్సు తల్లిలా నన్ను ఇన్నాళ్ళు సాకింది. ఇద్దరం ఒకరికొకరం తోడుగా బ్రతికాము. ఇక ఎవరి దారి వాళ్ళది. దేవుడా ఎక్కడున్నానా బస్సును కాపాడు' అని ప్రార్థించాడు కన్నీళ్ళు కారుస్తూ.

బస్సు బయలుదేరే సమయం కావడంతో ఒక్కొక్కరే వచ్చి బస్సులో కూర్చోసాగారు పాసెంజర్లు. కొద్దిసేపటికి బస్సు బయలుదేరింది. బస్సు వెంకటగిరి చేరగానే పాసెంజర్లందరూ దిగిన తరువాత బస్సును ఓనరు చెప్పిన యింటికి తీసుకుపోయాడు.

అక్కడ కొనుగోలు చేసిన ఆయన బస్సుకు ఆనందంగా ఎదురు నడిచాడు. బస్సు కాంపౌండులో పెట్టబడింది. బస్సు ఓనరు కొత్త ఓనరుతో

మాట్లాడి షేక్‌హాండిచ్చిపోయాడు. భాషా అక్కడే ఉండిపోయాడు. దానికి జరిగే పూజా పునస్కారాలు సాయంత్రంవరకు చూస్తూ కళ్ళుతుడుచుకొంటూ నిలబడ్డాడు.

"డ్రైవరు సాయిబూ, మాకు డ్రయివర్లుండారయ్యా. ఈ బస్సుకు డ్రయివరుగా నిన్ను పెట్టుకోలేం" అన్నాడు. ఖాదర్‌భాషాను యింకో విధంగా అర్థం చేసుకొన్న కొత్త ఓనరు.

ఖాదర్‌భాషా ఒకసారి తనివితీరా తన బస్సును చూసుకొని వెనక్కు తిరిగి మేనకూడుకు వచ్చేసాడు. మరుసటిరోజు ఉదయం పది గంటలప్పుడు తన తోటి డ్రైవరు నరసింహం వచ్చాడు.

"భాషా నిన్ను తీసుకురమ్మని ఓనరు పంపాడు. మధ్యాహ్నం రెండు గంటలకు క్రొత్త బస్సును రూటు మీద ఎట్టాలంట. మొదట నువ్వు బస్సును నడపాలని నిన్ను తీసుకురమ్మన్నాడు."

ఇంటిముందు వేపచెట్టు మొదట్లో కూర్చొని, వేపపుల్లతో పళ్ళు తోముకుంటున్న ఖాదర్‌భాషా "నాకు ఒళ్ళెంబాలేదురా. నేను రాలేను" అన్నాడు.

"నువ్వు తప్పక రావాలి. ఈ రోజు నువ్వే డ్యూటీలో ఎక్కాలంట. ఓనరు మరి మరి చెప్పాడు" బ్రతిమాలసాగాడు వచ్చినతను. ఖాదర్‌భాషా ససేమిరా రాసన్నాడు.

ఇక చేసేదేంలేక వచ్చినతను వెళ్ళిపోయాడు. ఖాదర్‌భాషా ఆ రోజంతా "మేనకూడులోనే ఉన్నాడు. కనబడ్డ వాళ్ళంతా" ఏం భాషా ఈ రోజు డ్యూటీకి అపా" అని పరామర్శించసాగారు.

ఖాదర్‌భాషా విచారంగా 'ఈ రోజే కాదు. ఇక ఎప్పటికీ ఆఫే'అని మనసులో గొణుక్కోసాగాడు. ఆ రోజు నుంచి బయటకు తిరగడం మానేసాడు. ఇంట్లోనే పడుకుని కాలం గడిపేవాడు. ఓనరు ఎంతమంది మనుషుల్ని పంపినా ఖాదర్‌భాషా డ్యూటీకీపోలేదు.

ప్రతి మనిషికి వయసు పెరిగేకొద్ది శక్తి తగ్గిపోతుంది. బుగ్గలు లోతుకుపోతాయి. కళ్ళు గుంటలు పడతాయి. జుట్టు తెల్లబడుతుంది. నడక వేగం తగ్గుతుంది. అంత మాత్రాన బిడ్డలు తల్లిదండ్రుల్ని ఇంట్లోంచి తరిమివేయడం ఏం న్యాయ్యం? ఇంతకాలం పెంచి పెద్ద చేసినందుకు అదేనాసరి అయిన ప్రతిఫలం.

అలాగే బ్యాంకులో అప్పుతెచ్చి మొట్టమొదటగా కొన్న బస్సును అమ్మేస్తాడా. అదేగా అతని ఆస్తిని అంతింతై, ఇంతింతై ఎంతో పెంచింది. ఒక బస్సు ఓనరును అభివృద్ధి చేసి, ఆరు బస్సుల ఓనరుగా చేసింది. పడిపోయేటట్లున్న పాత పెంకుటింటి స్థానంలో నాలుగు అంతస్థుల భవనం వెలియడానికి కారణం పందులు పొర్లాడే పదెకరాల దిబ్బ ఈనాడు కాపుతో నిండిన కొబ్బరిచెట్లతో నిగనిగలాడడానికి కారణం. తన బిడ్డలు రోజూ కారులో కాలేజీకి వెళ్ళే స్థితికి కారణం. ఆ బస్సు వచ్చిన వేళా విశేషమే. ఒకప్పుడు యాభై వేలు అప్పు తెచ్చిన ఓనరుకు యిప్పుడు అదే బ్యాంకులో యాభై లక్షల రూపాయలు డిపాజిట్టు ఉంది. ఇవన్నీ ఎవరు సంపాదించి పెట్టారు. అదే ... అదే.... ఎ. పి. యస్ డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్. ఒకప్పుడు రాజహంసలా ఉండే బస్సు, ఈనాడు కష్టించి, కృశించి కాకిలా అయింది.

ఓనరు పాలిట వరం. తన పాలిట దైవం. అలాంటి వరప్రసాదిని యైన డబుల్ ఫోర్, డబుల్ ఫైవ్ని వదులుకొనే దురదృష్టవంతులు ఇంకెవరైనా ఉంటారా. ఇదే ప్రస్తుతం ఖాదర్ భాషా బాధ. ఇలా మొదలైన అతని ఆలోచనలు క్రమేణా విషరూపం దాల్చాయి.

ఒకరోజు ఖాదర్ భాషాకు విపరీతమైన జ్వరం వచ్చింది. మనిషి వణికిపోతున్నాడు. శరీరం వేడితో పేలిపోతోంది. ఖాదర్ భాషా ఆలోచన లన్నీ బస్సు చుట్టూ ముసురుకొని ఉన్నాయి. 'ఎక్కడుంది నా ఎ.పి.యస్. డబుల్ ఫోర్, డబుల్ ఫైవ్ చెప్పండి. నేను అక్కడికి వెళ్తాను.' అంటూ

ఒకటే కలవరింతలు. అతని భార్య జమీలాకు దిగులుగా ఉంది. మందులు తెచ్చి ఇస్తూనే ఉంది. డాక్టరుకు చూపిస్తూనే ఉంది. అయినా జ్వరం తగ్గు ముఖం పట్టలేదు.

ఆ రోజు సాయంత్రం జమీలా దొడ్లోకి వెళ్ళి స్నానంచేసి వచ్చే సరికి బెడ్ మీద ఖాదర్ బాషా లేడు. ఆమె గుండె ఆగిపోయింది. ఇంటి చుట్టూ వెతికింది. ఎక్కడా కనిపించలేదు. గుండె బాదుకొంటూ వీధిలోకి పరుగెత్తింది.

"మీ ఆయన ఇప్పుడే బస్సులో వెంకటగిరికి వెళ్ళాడు" చెప్పారు అక్కడివారంతా.

"అయ్యో ఆయన జబ్బు మనిషే. దారిలో ఏదన్నా అయితే" ఏడుస్తూ కూలబడిపోయింది.

"ఏం కాదులెమ్మా. డాక్టరుకు చూపించుకోడానికి వెళ్ళుంటాడు. ఇప్పుడేం నువ్వు వెనక బస్సులో వెళ్ళరాదూ" కొందరు సలహా ఇచ్చారు.

ఇక రెండు గంటలకు లాస్టు బస్సు. జమీలా ఇంటికి వెళ్ళి సంచిలో భర్త గుడ్డలు ఒక జత పెట్టుకుని లాస్టు బస్సుకు వెంకటగిరికి వెళ్ళింది. వెంకటగిరిలో బస్టాండు దగ్గరగాని, డాక్టర్ల దగ్గరగాని ఎక్కడా కనిపించ లేదు ఖాదర్ ఖాషా. చివరకు ఆమె ఆరాతీసి డబుల్ ఫోర్ డబుల్ ఫైవ్ బస్సును కొన్న ఓనరును కలిసింది.

వరండాలో వాలుకుర్చీలో కూర్చొని దమ్ములాగుతున్న ఓనరు అంతా విని నవ్వుతూ "వాడా! పిచ్చిముండాకొడుకా! ఇందాక నా దగ్గరకు వచ్చినా డబుల్ ఫోర్, డబల్ ఫైవ్ అని అడిగాడు. అది ఇక్కడెందు కుంటుందిరా రాపూరు రూటు పల్లెల్లో తిరుగుతూంటుంది రాత్రి పదిగంటల కొస్తుందని చెప్పాను. అంతే, పరుగెత్తుకొని వెళ్ళాడు" అన్నాడు.

జమీలా గుండె జల్లుమంది. విచారిస్తే రాపూరుకు వెళ్ళే బస్సులు

అరుగంటలకే అన్నీ వెళ్ళిపోయాయని తెలిసింది. మరి తన భర్త ఎలా వెళ్ళినట్లు ? నడచి వెళ్ళాడా ఈ చీకట్లో, అంత జ్వరంలో నడచి ఎలా వెళ్ళగలడు. ఆమె ఏడుస్తూ బస్టాండులో కూలబడింది.

ఖాదర్ భాషా రోడ్డున నడుస్తున్నాడు. వెంకటగిరి వదలి దాదాపు ఐదు మైళ్ళు నడిచాడు. దారంతా చీకటి. రద్దీ ఉన్న రోడ్డు కాకపోవడంతో అప్పుడొకటి, ఇప్పుడొకటి మాత్రమే వస్తున్నాయి. కాని ఆ చీకట్లో తట్టుకొంటూ తడుముకొంటూ నడుస్తున్నాడు. అతని శరీరం జ్వరంతో పేలిపోతోంది. ఆ జ్వరంలో సంధిప్రేలాపనలు.

ఉర్దూలో ఖురాను చదువుతూ అల్లాను ప్రార్థిస్తున్నాడు. తెలుగులో వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నాడు. ఇందర్ని ప్రార్థించేది తన డబుల్ ఫోర్ డబుల్ ఫైవ్‌ని కాపాడమనే. ఇంతలో ఆకాశంలో మెరుపులు ప్రారంభమయ్యాయి. ఆ మెరుపు వెలుతుర్లో రోడ్డును చూసిన ఖాదర్ భాషా రోడ్డును, రోడ్డువేసిన కాంట్రాక్టరును తిట్టసాగాడు. రోడ్డు సరిగా వేయలేదని వెళ్ళుకొచ్చిన రాళ్ళు తన బస్సు చక్రానికి తగులుతాయని బాధపడసాగాడు.

ఇంతలో సన్నగా వర్షం మొదలైంది. క్రమేణా పెద్దది కాసాగింది. తుఫాను వాతావరణం కనిపించసాగింది. ముందే జ్వరం, దాంతోపాటు వర్షంలో తడవడం, కొద్దిదూరం నడచి కళ్ళు తేలిపోయి రోడ్డుమీద దభీమని పడిపోయాడు. కుంభవృష్టిగా కురిసే నీళ్ళలో అతను పడిఉన్నాడు.

దూరంగా లైట్లు వేసుకొని డబుల్ ఫోర్ డబుల్ ఫైవ్ బస్సు భారంగా వస్తూ ఉంది. జనం కిటకిటలాడుతున్నారు. బస్సు గుంటల్లో పడ్డప్పుడు పైకి లేచేటప్పుడు కరకరమంటోంది. కాని బస్సు డ్రైవరు దానికున్న శక్తినంతా వినియోగించుకొంటున్నాడు.

బస్సు నలభై కిలోమీటర్ల వేగంతో వస్తోంది. రోడ్డుమీద పడున్న ఖాదర్ భాషాను డ్రైవరు గుర్తించలేదు. అంతే వేగం తగ్గకుండా అతన్ని సమీపించింది.

ఏదో దైవశక్తి ఆజ్ఞాపించినట్లు, ప్రకృతి శాసించినట్లు, బస్సు ముందు

చక్రాలు రెండు ఖాదర్ భాషా శరీరాన్ని అనుకొని బస్సు కీచుమంటూ ఆగి పోయింది.

తల్లి ఎన్నో సంవత్సరాల తరువాత కనిపించిన బిడ్డను గుండెలకు హత్తుకొని మాతృప్రేమలోని స్పర్శానుభూతిని పొందుతుంది. అలాగే పాలు తాగే తన లేగదూడను ఆవు ఎంతో ఆనందంగా నాకుతుంది. ఆ స్పర్శాను భూతిలోని మాధుర్యం ఆ ఇద్దరికే తెలుసు.

అలాగే రెండు టైర్లు ఖాదర్ భాషా శరీరాన్ని స్పృశిస్తున్నాయి. డ్రైవరు ఎంత ప్రయత్నించినా బస్సు అంగుళం కూడా ముందుకు కదల్లేదు. దిగివచ్చిన డ్రైవరు చక్రాల దగ్గర పడి ఉన్న ఖాదర్ భాషాను చూసి "బాబోయ్ నా బస్సు క్రింద మనిషి పడిండు" అంటూ పెద్దగా అరిచాడు.

"ఓయమ్మో" అంటూ జనం చాలామంది దిగారు.

"ఎవడో తాగినోడు లాగుంది. ఇంతకీ మనిషి చచ్చేడా, బ్రతికేడా చూడండి" అంటున్నారు కొందరు.

డ్రైవరుకు యావజ్జీవ కారాగార శిక్ష వేస్తారని కొందరు, కాదు పదేళ్ళని కొందరు వాదులాడుకోసాగారు.

ఇంతలో దూరంనుంచి హెడ్‌లైట్ల కాంతిలో పరుగెత్తుకు వచ్చింది జమీలా. మనిషి ముద్దగా తడిసి, జుట్టు విరియబోసుకుని ఉన్న ఆమెను చూసి కొందరు భయపడ్డారు. ఆమె బస్సు దగ్గరకు వచ్చి డ్రైవరుకు, మిగతా వాళ్ళకు తన భర్త కథ యావత్తూ చెప్పింది. ఈ లోపల కొందరు మనుషులు ఖాదర్ భాషాను అక్కడ్నుంచి బయటకు లాగారు.

"అయ్యో! ఇది మన డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్" భర్త చెవిలో చెప్పింది జమీలా.

"ఆ" అంటూ లేచి కూర్చున్నాడు ఖాదర్ భాషా.

అందరూ చూస్తుండగా బస్సునంతా నిమిరాడు. ఓ గంటసేపు దాన్నే చూస్తూ నిలబడ్డాడు. మళ్ళీ స్పృహతప్పి పడిపోయాడు.

చిన్న రిపేరుతో బస్సు మళ్ళీ బయలుదేరింది.

ఖాదర్ భాషాను అదే బస్సులో వెంకటగిరికి చేర్చారు. ఆ రాత్రంతా

హాస్పిటల్‌లో పెట్టుకొని మరునాడు మందులు కొనుక్కొని భర్తను ఇంటికి తీసుకెళ్ళింది జమీలా.

* * * *

రోజులు గడిచిపోతున్నాయి. ఖాదర్‌భాషా జబ్బు తగ్గుముఖం పట్టడంలేదు. కొన్ని రోజులు గడిచేసరికి మనిషి కట్టెలా అయిపోయాడు. గడ్డం పెంచేసాడు. ఎప్పుడూ తన డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్‌నే కలవరించ సాగాడు.

ఒకరోజు ఖాదర్‌భాషా ఇంటిముందు కొత్త ఇంపాలా కారు ఆగింది. అందులోంచి ఓనరు దిగి ఖాదర్‌భాషా ఇంటిలో ప్రవేశించాడు.

ఖాదర్‌భాషా మంచానికి అంటుకుపోయి పైకప్పు చూస్తూ డబుల్ ఫోర్ డబుల్ ఫైవ్ అని కలవరిస్తూ ఉన్నాడు. ఓనరు కళ్ళలో నీరు ఉబికింది.

మంచం ప్రక్కనే ఉన్న స్టూలుమీద కూర్చొని ఖాదర్‌భాషా రెండు చేతులు పట్టుకొని ఎంతో ఆరవంగా "భాషా భాయ్ నీ డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్ ఎక్కడికి పోలేదు. మళ్ళీ నేనే కొంటున్నాను. నీ కోసం కాదు. నా కోసం. నా క్షేమం కోసం. కాకపోతే కొత్త బస్సు లైలాండు కొన్న రోజునుంచి రోజూ వెంట్రుకవాసిలో యాక్సిడెంట్లు తప్పిపోవడ మేనా. నన్నింతవాడ్ని చేసిన బస్సును అమ్మినందుకు, నాకు విశ్వాస పాత్రుడవయిన నీ మాట కాదన్నందుకు నాకు తగిన శాస్తే జరిగింది. కొత్త బస్సు వేరే రూట్లో వేసుకొంటాను. భాషాభాయ్ నువ్వు నాకు ఒక కన్నయితే డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్ రెండవ కన్ను. మీరు లేందే ఒక్క రోజు జరుగదు." ఏడుస్తూ బ్రతిమాలసాగాడు.

డబుల్ ఫోర్-డబుల్ ఫైవ్ మళ్ళీ తన చేతికొస్తుందనేసరికి ఖాదర్‌భాషాలో జీవం వచ్చింది. ఓనరు చేతుల్లో ఉన్న తన రెండు చేతుల్ని వదిలించుకుని పైకెత్తి నమస్కరించాడు ఎంతో భక్తిగా.

***